నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, మంగళవారం 23 ఏప్రిల్ 2024 | NIZAMABAD


విద్యుద్దీపాల వెలుగులో జిల్లా కేంద్రంలోని గోల్‌హనుమాన్ ఆలయం

## నేడు హనుమాన్ జయంతి

**ఉమ్మడి జిల్లాలో** మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయాలను అందంగా ముస్తాబు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. పలు ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపట్టనున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో హనుమాన్ శోభాయాత్ర నేపథ్యంలో ట్రాఫిక్‌ను మళ్లించనున్నారు. జిల్లాలోని మద్యం దుకాణాలను మంగళవారం ఉదయం 6 నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు మూసి ఉంచాలని సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ సోమవారం ఓ ప్రకటనలో సూచించారు.

## జీవన్‌రెడ్డిని కేంద్ర మంత్రిని చేస్తా

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- బోడగుండోడు అంటూ అర్వింద్‌పై విసుర్లు
- బీజేపీ మత విద్వేషాలు రెచ్చగొడుతున్నదని ఆగ్రహం


సభలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి


నిజామాబాద్, ఏప్రిల్ 22 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ఖలీల్‌వాడి : స్వయానా రైతు అయిన జీవన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే ఆయనను కేంద్ర మంత్రిని చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. కేంద్ర మంత్రి హోదాలో జీవన్‌రెడ్డి పసుపుబోర్డు, మద్దతు ధర సహా రైతులకు మంచి చేసే నిర్ణయాలు తీసుకుంటారని, అందుకు తనది బాధ్యత అని తెలిపారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం నిర్వహించిన జన జాతర కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడారు. సెప్టెంబర్ 17లోపు బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని ప్రకటించారు. ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ, రైతుభరోసా అందిస్తామని బాసర సరస్వతీ అమ్మవారిపై ఒట్టేసి చెప్పారు. బండి, గుండులను నమ్మేది లేదని బీజేపీ ఎంపీలు అర్వింద్, బండి సంజయ్‌లను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారో చెప్పకుండా బీజేపీ మోసం చేస్తున్నదని మండిపడ్డారు. కేంద్రం ఇచ్చిన జీవోలో నిజామాబాద్ పేరే లేదన్నారు. పసుపు బోర్డు హిమాలయాల్లో పెడతాడో.. ఎక్కడ పెడతాడో? ఎప్పటి లోపు స్థాపిస్తారో కూడా చెప్పడం లేదని విమర్శించారు. ఏమయ్యా మిత్రమా అర్వింద్.. పసుపుబోర్డుకు, స్పైసెస్ బోర్డుకు రైతులకు తేడా తెలియదా అంటూ నవ్వుతూ సీఎం వ్యాఖ్యానించారు.

### మోదీ ఓటమి ఖాయం..

ప్రధాని మోదీకి ఓటమి భ యం పట్టుకుందని, అందు లో భా గంగానే కాంగ్రెస్ పార్టీపై నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని రేవంత్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగంపై ప్రమాణం చేసిన ప్రధాని మతాల మధ్య చిచ్చు పెడుతున్నాడంటే మోదీకి ఓటమి ఖాయంగా కనిపిస్తోందని చెప్పారు. దేవుడు గుడిలో ఉండా లి. భక్తి గుండెలో ఉండాలి. పోలింగ్ బూత్ లో కాదని బీజేపీని ఉద్దేశించి అన్నారు.

### వేదికపై జహీరాబాద్ నేతలు..

సభావేదికపై పక్క లోక్‌సభ నియోజకవర్గానికి చెంది న నేతలు ఆసీనులు కావడం, స్థానిక నాయకత్వాన్ని ఇబ్బందికి గురి చేసింది. జహీరాబాద్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనకుండా ముఖ్యమంత్రి దృష్టిలో పడేందుకు వేదికపై తళుక్కుమంటూ ఆపసోపాలు పడిన పలువురి తీరును సొంత పార్టీ నేతలే తప్పుబట్టారు. బాన్సువాడ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఓడిపోయిన ఏనుగు రవీందర్‌రెడ్డి, కామారెడ్డి నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, కామారెడ్డి డీసీసీ నేతలు సైతం వేదికపై ఆసీనులయ్యారు. మంత్రి శ్రీధర్ బాబు, పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ అభ్యర్థి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతి రెడ్డి, డీసీసీ ప్రెసిడెంట్ మానాల మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.




# ఓట్ల వేటలో పునరుద్ధరణ

- సెప్టెంబర్ 17లోగా తెరిపిస్తామన్న సీఎం
- నిజామాబాద్ సభలో ప్రకటన
- గతంలోనూ మాట ఇచ్చి తప్పిన కాంగ్రెస్
- శాసనసభ కమిటీ నివేదికను తొక్కిపెట్టిన వైఎస్ సర్కారు
- ఫ్యాక్టరీలో పాడుబడిన యంత్రాలు..
- చెరుకు సాగుకు దూరమైన రైతులు
- కనీస కార్యాచరణ లేకుండానే సీఎం ప్రకటన
- అది ఎలా సాధ్యమంటున్న కార్మికులు, కర్షకులు

బోధన్, ఏప్రిల్ 22: లోక్‌సభ ఎన్నికల వేళ నిజాం షుగర్స్ పునరుద్ధరణ అంశం మరోమారు తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఓట్ల వేటలో ఫ్యాక్టరీని రాజకీయ అంశంగా మార్చుకుంది. అసియాలోనే అతిపెద్ద చక్కెర కర్మాగారంగా పేరుగాంచిన బోధన్ షుగర్ ఫ్యాక్టరీని సెప్టెంబర్ 17లోపు ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం ఇప్పుడు చర్చనీయాంశమైంది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా నిజామాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో ఫ్యాక్టరీ పునరుద్ధరణపై సీఎం ప్రకటన చేశారు. అయితే, గతానుభవాల దృష్ట్యా కార్మికులు, కర్షకులు కాంగ్రెస్ సర్కారు ప్రకటనను పట్టించుకోవడం లేదు. గతంలోనూ ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఇలాగే హామీ ఇచ్చిన హస్తం పార్టీ ఎన్నికలు ముగియగానే ఆ అంశాన్ని విస్మరించింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లోనూ పునరుద్ధరణపై మాట ఇచ్చి అధికారం చేపట్టిన కాంగ్రెస్.. ఆ తర్వాత కమిటీ పేరుతో కాలయాపన చేసింది. ఈ నేపథ్యంలోనే సీఎం రేవంత్ ప్రకటనపై రైతులు, కార్మికులు పెద్దగా ఆశలు పెట్టుకోలేదు.

### కార్యాచరణ ఏది..?

నిజాంషుగర్స్ పునరుద్ధరణకు అనేక సాంకేతిక కారణాలు అడ్డంకిగా ఉన్నా యి. ఎన్‌సీఎల్‌టీలో వివాదం, ఫ్యాక్టరీలోని యంత్రాల స్థితిగతులు, ముడిసరుకు అయిన చెరుకుసాగు పెంపు వంటివి ప్రధాన ఆటంకాలుగా మారాయి. వీటిని ఎలా పరిష్కరించాలన్న దానిపై కార్యాచరణ లేకుండానే రేవంత్‌రెడ్డి ప్రకటన చేయడం విస్మయానికి గురిచేస్తున్నది. ఫ్యాక్టరీల్లో తుప్పు యంత్రాల మరమ్మతులకు సంబంధించిన అంచనాలను రూపొందించిన దాఖలాలు లేవు. బోధన్ శక్కర్‌నగర్‌లో ప్రస్తుతమున్న ఫ్యాక్టరీ యంత్రాలు శిథిలావస్థకు చేరాయి. ఈ పాత ఫ్యాక్టరీకి బదులుగా కొత్త ఫ్యాక్టరీ ఏర్పాటుచేయాలన్న భావనను నిజాం షుగర్స్ పునరద్ధరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ సభ్యులు వ్యక్తంచేశారు. పోనీ, ఆ దిశగా కొత్తగా ఫ్యాక్టరీని ఎక్కడ, ఏ విధంగా ఏర్పాటుచేస్తారన్న విషయమై స్పష్టత లేదు. అన్నింటికంటే ముందుగా ప్రైవేట్ యాజమాన్యం నుంచి నిజాం షుగర్స్ యూనిట్లను స్వాధీనం చేసుకునేందుకు ఎదురయ్యే సాంకేతిక అడ్డంకుల పరిష్కారం ఇంకా జరగనే లేదు. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి నిజాం షుగర్స్‌ను సెప్టెంబర్ 17లోగా తెరిపిస్తామనడంపై సహజంగానే సందేహాలు తలెత్తుతున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపనతోనే సరిపెడుతుందన్న ఆందోళన రైతులు, కార్మికుల్లో వ్యక్తమవుతున్నది.

### నాడు, నేడు వారే సభ్యులు..


మొన్నటి అసెంబ్లీ ఎన్నికల అనంతరం కాంగ్రెస్ సర్కారు.. నిజాం షుగర్స్‌కు చెందిన శక్కర్‌నగర్, జగిత్యాల జిల్లా ముత్యంపేట్, మెదక్ జిల్లా ముంబోజిపల్లి యూనిట్ల పునరద్ధరణ కోసం కమిటీని ఏర్పాటుచేసింది. ఈ కమిటీలో ఆయా జిల్లాల పరిధిలోని ఎమ్మెల్యేలు, మంత్రి శ్రీధర్‌బాబు సభ్యులుగా ఉన్నారు. తాజా కమిటీలో సభ్యుడిగా ఉన్న బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు 2006లో నియమించిన శాసనసభా సంఘంలోనూ సభ్యులుగా ఉండడం గమనార్హం. అప్పటి నివేదిక ఎందుకు బుట్టదాఖలైందో చెప్పాల్సిన బాధ్యత ఉన్న ఈ ఇద్దరు నోరు మెదపడం లేదు. పునరద్ధరణ కమిటీ ఇటీవల ఫ్యాక్టరీలను మొక్కుబడిగా సందర్శించింది. చెరుకు లభ్యత, యంత్రాల పరిస్థితిపైనా లోతైన అధ్యయనం చేయకపోవడంతోనే కాంగ్రెస్ సర్కారు ఆంతర్యమేమిటో అర్థమవుతున్నదని రైతులు చెబుతున్నారు.

### ఎన్నికలప్పుడే గుర్తుకొస్తాయా..

నిజామాబాద్ జిల్లా అంటేనే ప్రధానంగా పసుపు, చెరుకు సాగుకు ప్రసిద్ధి. అయితే, ఎన్నికల్లో ఈ రెండు అంశాలు కీలకంగా మారాయి. జిల్లాకు కీలకమైన పుసుపుబోర్డు, నిజాం షుగర్స్ కావొచ్చు.. ఎన్నికలప్పుడే ఆయా అంశాలతో రాజకీయాలు చేయడం అటు కాంగ్రెస్‌కు, ఇటు బీజేపీకి అలవాటుగా మారింది. ఎన్నికలప్పుడు ఓట్ల కోసం వీటిపై హామీలు ఇవ్వడం, ఆ తర్వాత మర్చిపోవడం సర్వసాధారణమైంది. వైఎస్ జమానా నుంచి కాంగ్రెస్ నిజాంషుగర్స్ పునరుద్ధరణ అంశాన్ని ఎన్నికల అస్త్రంగా మార్చుకుంటూనే ఉంది తప్పితే ఇప్పటికీ తెరిపించింది లేదు. నిజాం షుగర్స్ స్వాధీనంపై శాసనసభా సంఘాన్ని ఏర్పాటుచేసిన ఆనాటి వైఎస్ ప్రభుత్వం.. కమిటీ నివేదికను బుట్టదాఖలు చేసిన విషయాన్ని ఇటు రైతులు, అటు కార్మికులు ఇంకా మర్చిపోలేదు.

### సాంకేతిక అడ్డంకులను గమనించారా?

ఇప్పుడైతే నిజాం షుగర్స్ పరిధిలో చెరుకు పంట సాగులో లేదు.. చెరుకు సాగు కోసం ఉన్న అడ్డంకులను తొలగించే చర్యల్లేవు. చెరుకు సాగు వైపు రైతుల్ని మళ్లించే ప్రయత్నాలు లేవు. ఫ్యాక్టరీ స్వాధీనానికి సంబంధించి ప్రైవేట్ కంపెనీతో ఉన్న చిక్కుముడుల్ని విప్పే దిశగా సంప్రదింపుల్లేవు. ఎటువంటి కసరత్తు, కార్యాచరణ లేకుండా నోటిమాటగా నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామనడంపైనే అందరికీ సందేహాలు తలెత్తుతున్నాయి.





అంక్సాపూర్‌లో రోడ్‌షోలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

## కాంగ్రెస్ నాయకులను నిలదీయండి

- అబద్ధపు హామీలిచ్చి గద్దెనెక్కిన హస్తం పార్టీ
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి
- అంక్సాపూర్, పడగల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

వేల్పూర్, ఏప్రిల్ 22 : ఎన్నికల్లో మోసపూరిత హామీలిచ్చిన కాంగ్రెస్ నాయకులు గ్రామాలకు వస్తే నిలదీయాలని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని అంక్సాపూర్, పడిగెల్ గ్రామాల్లో వేముల సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత మాటలతో అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలువగానే ఆరు గ్యారెంటీ పథకాలను అమలుచేస్తామని చెప్పి రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. ఆ పార్టీ అధికారం చేపట్టి వంద రోజులు దాటిపోయినా ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలు చేయలేదన్నారు. రైతులకు రుణ మాఫీ, రైతుభరోసా, వరికి రూ.500 బోనస్, ఉపాధి హామీ కూలీలకు రూ.12వేలు ఇస్తామని హామీలు ఇచ్చి మరిచిపోయిందన్నారు. పింఛన్ రూ. 4వేలు, దివ్యాంగులకు రూ.6వేలు, మహిళలకు రూ.2,500, తులం బంగారం ఇవన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎంపీ అర్వింద్ జిల్లాకు ఎన్ని నిధులు తీసుకువచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. మళ్లీ ఓట్లు అడగడానికి గ్రామాలకు ఏ ముఖం పెట్టుకుని వస్తారని విమర్శించారు. కేవలం దేవుడి పేరు చెప్పుకుంటూ బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారని అన్నారు. పదేండ్లు ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన బీఆర్‌ఎస్‌ను ప్రజలు స్వాగతించాలన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ప్రచార కార్యక్రమంలో ఎంపీపీ భీమా జమున, బీఆర్‌ఎస్ నాయకులు రాజేందర్‌రెడ్డి, మిట్టాపల్లి మహిపాల్, నాగధర్, రాజ్‌కుమార్, రేగుళ్ల రాములు, ఏనుగు గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్లమెంట్‌లో మన గళం వినిపిద్దాం..

- జహీరాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్
- మద్నూర్,డోంగ్లీలో మాజీ ఎమ్మెల్యే షిండేతో కలిసి రోడ్‌షో


మద్నూర్‌లో మాట్లాడుతున్న గాలి అనిల్‌కుమార్, పక్కన షిండే

మద్నూర్/డోంగ్లీ, ఏప్రిల్ 22: బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని జహీరాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మద్నూర్, డోంగ్లీలో సోమవారం నిర్వహించిన రోడ్‌షోలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండేతో కలిసి పాల్గొని మాట్లాడారు. తనను గెలిపించాలని, పార్లమెంట్‌లో మన గళం వినిపించి అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. మద్నూర్‌కు కేంద్రీయ విద్యాలయం తీసుకువస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో పరిశ్రమలు ఏర్పాటు చేయించి, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కాంగ్రెస్, బీజేపీలతో ఎలాంటి అభివృద్ధి జరగదన్నారు. మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే మాట్లాడుతూ.. ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. రూ. 4వేల పింఛన్, తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కారు గుర్తుకు ఓటు వేసి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.



## అంజన్న సన్నిధిలో గోవన్న ముడుపు

*నిజామాబాద్ లోక్‌సభ బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ సోమవారం జగిత్యాల జిల్లా కొండగట్టు అంజన్న స్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ముడుపు కట్టి మొక్కుకున్నారు. అనంతరం స్థానికులతో ముచ్చటించారు. బాజిరెడ్డి వెంట స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, మాజీ మంత్రి రాజేశం గౌడ్ తదితరులు ఉన్నారు.*

*–ఖలీల్‌వాడి, ఏప్రిల్ 22*

## కొనసాగుతున్న నామినేషన్ల పర్వం

### ఒక్కరోజే 12 నామినేషన్లు

ఖలీల్‌వాడి, ఏప్రిల్ 22: నిజామాబాద్ లోక్‌సభ ఎన్నికల నామినేషన్ల పర్వం కొనసాగుతున్నది. సోమవారం 12 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 28 నామినేషన్లు వచ్చినట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ మూడో సెట్ నామినేషన్ వేయగా.. బీజేపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్ రెండో సెట్ నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. వీరితోపాటు స్వతంత్ర, వివిధ పార్టీల నాయకులు నామినేషన్లు వేసినట్లు వెల్లడించారు.


బీఆర్‌ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి తరపున నామినేషన్ వేస్తున్న ఆయన సతీమణి


దోమకొండలోని ఓ ఇంటి ఆవరణలో పిడుగుపాటుకు దగ్ధమవుతున్న కొబ్బరి చెట్టు


టీకారం తండాలో వర్షానికి కుప్పకూలిన రేకుల షెడ్డు


కామారెడ్డిలో రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు


జలమయమైన రోడ్లు

## ఉమ్మడి జిల్లాలో ఈదురు గాలులు

- పలు ప్రాంతాల్లో భారీ వర్షం.. తడిసిన ధాన్యం
- ధ్వంసమైన ఇండ్లు

కామారెడ్డి/ పెద్ద కొడప్‌గల్/నవీపేట్/దోమకొండ, ఏప్రిల్ 22: ఉమ్మడి జిల్లాలో సోమవారం ఈదురు గాలులు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. కామారెడ్డిలో గంటపాటు కురిసిన వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ వెనుక ఓ చెట్టు నేలకూలింది. పెద్ద కొడప్‌గల్, టీకారం తండా తదితర గ్రామాల్లో ఈదురుగాలులకు రేకుల ఇండ్లు కూలిపోయాయి. రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. వర్షానికి వరి, మక్కజొన్న, జొన్న కొట్టుకుపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నవీపేట మండలంలోని మోకన్‌పల్లి గ్రామ శివారులో పిడుగు పాటుకు మిర్యాల ఒడ్డెన్న కు చెందిన ఆవు మృతి చెందింది. ఆవు ధర రూ. 50 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని యజమాని కోరాడు. దోమకొండ మండల కేంద్రంలోని బీబీపేట రోడ్డులో ఉన్న అయ్యవారి రామాచారి ఇంటి ఆవరణలో ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది.దీంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. పిడుగు పడిన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరుగలేదు.


పెద్దకొడప్‌గల్ మండలం టీకారం తండాలో వర్షానికి కూలిన రేకుల ఇళ్లు

## వరి కొయ్యలకు నిప్పుపెట్టబోయి మృత్యువాత

- దట్టమైన పొగతో ఊపిరాడక గుండెపోటు
- పొలంలోనే సజీవదహనమైన రైతు

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 22: వరి కొయ్యలకు నిప్పుపెట్టబోయి ఓ రైతు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన బీర్కూర్ మండల కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అరిగె రాములు(67) ఆదివారం ఉదయం గ్రామ శివారులోని తన పొలంలోని వరి మొదళ్లకు నిప్పంటించగా దట్టమైన పొగ రావడంతో గుండెపోటుకు గురై కిందపడిపోయాడు. ఈ క్రమంలో ఒంటికి నిప్పంటుకుని మృతిచెందాడు. రాములు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యు లు, బంధువులు గాలించగా.. రాత్రి మృతదేహం లభించింది. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు రాలేదని వారు సమాధానమిచ్చారు.


రాములు (ఫైల్)